సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

రాంగోపాల్‌పేట్‌: బీసీ కార్పొరేషన్‌ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరుతూ తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ప్రతాపగిరి విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక, రాజకీయ అనేక రంగాలలో వెనుకబడి ఉన్న బీసీ, ఎంబీసీ, సంచార జాతులలో ఉన్న కులాలలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక దిక్కుతోచని పరిస్థితులలో అల్లాడుతున్నారన్నారు. గతంలో బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా బీసీలకు సబ్సిడీ రుణాలు, బీసీ బంధు పేరుతో రుణాలు ఇచ్చారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2024–25 బడ్జెట్‌ సమావేశాల్లో బీసీలకు ఎనిమిది వేల కోట్లు కేటాయించారన్నారు. అందువల్ల అర్హులైన బీసీ



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కులాలకు సబ్సిడీ రుణాలు అందించటం కోసం ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వెంటనే గైడ్‌లైన్స్‌ ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తెలంగాణ కుమ్మర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్‌, రజక సంఘం అధ్యక్షుడు కంటి ఆనందం, వడ్డెర సంఘం పల్లప్పు సమ్మయ్య, ప్రతాపగిరి గోవర్ధన్‌, నందికంటి సాయికుమార్‌, బిక్షపతి, బర్కం రామ్మోహన్‌ తదితరులు ఉన్నారు.

లేబర్‌ కార్డుతో.. ఆరోగ్యమస్తు!

- ప్రతిరోజూ 5 చోట్ల వైద్య శిబిరాలు
- వారంలో రెండుసార్లు మెగా శిబిరాలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు
- జనవరి నుంచి మందులు కూడా పంపిణీ

కార్డు ఉన్న ప్రతి కార్మికుడికీ ఉచిత వైద్యం

బంజారాహిల్స్‌: భవన నిర్మాణరంగ కార్మికుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా ఆ కార్డు కలిగి ఉన్నవారికి ఏడాదికోసారి రక్త పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వైద్య సూచనలకు సిఫారసు చేస్తుంది. రిజిస్టర్‌ చేసుకున్న నిర్మాణరంగ కార్మికులకు సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నది. 130కి పైగా ఆరోగ్య పరీక్షలు ఇందులో చేస్తున్నారు. ముఖ్యంగా చెవి వినికిడి, రక్తపోటు, కంటి చూపు స్క్రీనింగ్‌, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించడమే కాకుండా అనుభవజ్ఞులైన డాక్టర్ల నుంచి వైద్య సూచనలు కూడా ఇస్తున్నారు.



బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-12 ఎన్‌బీటీనగర్‌ బస్తీ దవాఖానాలో లేబర్‌ కార్డు కలిగిన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వారంలో రెండుసార్లు..

కామన్‌ సర్వీస్‌ సెంటర్‌ (సీఎస్‌ఈ) ఆధ్వర్యంలో నిర్మాణ రంగ కార్మికులకు హైదరాబాద్‌ జిల్లా పరిధిలోని అన్ని మండలాల పరిధిలో బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఐదు చోట్ల ఈ శిబిరాలు ఏర్పాటవుతున్నాయి. ఇక గురు, ఆది వారాల్లో మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌ జిల్లా పరిధిలో రిజిస్టర్‌ నిర్మాణ రంగ కార్మికులకు ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరాల్లో లేబర్‌ కార్డు కలిగి ఉన్నవారంతా పరీక్షలకు హాజరవుతున్నారు.

జనవరి నుంచి అందుబాటులో వైద్యులు



ప్రస్తుతం అన్ని మండలాల పరిధిలోని బస్తీ దవాఖానాలు, యూపీఎస్సీల్లో లేబర్‌ కార్డు కలిగి ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి నుంచి డాక్టర్‌ను కూడా సంప్రదించే పరిస్థితులను తీసుకువస్తున్నాం. మరో రెండు నెలల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న కార్మికులు తమ రిపోర్టులను ఆయా వైద్యుల వద్దకు తీసుకువెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు. అలాగే మందులు కూడా ఉచితంగానే పంపిణీ చేస్తారు. కామన్‌ సర్వీస్‌ సెంటర్‌ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతున్నది. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇది పనిచేయనుంది. అప్పుడు ట్యాబ్లెట్లు కూడా ఉచితంగా అందించడం జరుగుతుంది. లేబర్‌ కార్డు కలిగి ఉన్నవారు ఏడాదికోసారి తప్పనిసరిగా హెల్త్‌ చెకప్‌ చేయించుకోవాలి. సదరు కార్డు కలిగి ఉన్నవారు రెన్యువల్‌ చేయించుకోవాలంటే ఈ హెల్త్‌ చెకప్‌ ఎంతగానో ఉపయోగపడుతుంది. సదరు వ్యక్తి ఉన్నాడా? లేడా అనే విషయాలు వెలుగుచూస్తాయి. ఉచితంగా అందించే ఈ వైద్య శిబిరాలను కార్మికులు వినియోగించుకోవాలి. ఎక్కడెక్కడ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తారో ఆయా ప్రాంతాల్లో ముందుగానే ప్రచారం చేయడం జరుగుతుంది. ఎక్కడ వైద్య శిబిరం ఉంటుందో ఆ వివరాలను ముందుగానే వెల్లడిస్తాం. కార్మికుల ఆరోగ్యమే ప్రధానంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.

– బొల్లెట్ల మనోహర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్‌, సీఎస్‌ఈ, హైదరాబాద్‌ జిల్లా

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయాల ధరలు (కిలో.. రూపాయల్లో) ఈ విధంగా ఉన్నాయి. టమాటా.43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 38, క్యాప్సికమ్‌ 55, పచ్చకాకర 26, పందిరి బీర 45, క్యాబేజీ 31, క్యారెట్‌ 47, దొండ 35, గుండుబీన్స్‌ 45, గింజ చిక్కుడు 58, గోకరకాయ 28, కీర 26, దోసకాయ 27, బీట్‌రూట్‌ 43, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 15, పొట్లకాయ 23 ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బన్సీలాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ ఓల్డ్‌ బోయిగూడలోని ఆదయ్య మెమోరియల్‌ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సికింద్రాబాద్‌ మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌ మండల డిప్యూటీ డీఈఓ జి. శ్రీధర్‌ హాజరు కాగా మండల నోడల్‌ అధికారి యాదగిరి, న్యాయనిర్ణేతలుగా అరుణకుమారి, విజయలక్ష్మి, రాము తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్‌ చిలుక భాస్కర్‌, కె. విజయ, రేణుక, భవానీ, విజయలక్ష్మి, సంపత్‌, జీవన్‌ బాబు, ఆదయ్య ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌ సన్‌షైన్‌ హాస్పిటల్‌ సందర్శించిన అమెరికా బృందం



కిమ్స్‌ సన్‌షైన్‌ హాస్పిటల్‌లో అమెరికన్‌ కాలేజ్‌ ఆఫ్‌ నర్స్‌–మిడ్‌ వైఫ్స్‌ ప్రతినిధుల బృందం

సనత్‌నగర్‌: అమెరికన్‌ కాలేజ్‌ ఆఫ్‌ నర్స్‌–మిడ్‌ వైఫ్స్‌ ప్రతినిధుల బృందం బేగంపేటలోని కిమ్స్‌ సైన్‌షైన్‌ హాస్పిటల్‌ను సందర్శించారు. వైద్య రంగంలో అవలంబిస్తున్న చికిత్స పద్ధతులు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఆపరేషన్‌ థియేటర్లను పరిశీలించారు. హాస్పిటల్‌లో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ, వైద్య సదుపాయాలతో అందిస్తున్న చికిత్స విధానాలను అడిగి తెలుసుకున్నారు. అమెరికన్‌ కాలేజ్‌ ఆఫ్‌ నర్స్‌ మిడ్వైఫ్స్‌ డెలిగేషన్‌ ప్రతినిధి డాక్టర్‌ కేథరీన్‌ కాలిన్స్‌ పులియాతో పాటు ప్రతినిధి బృందానికి కిమ్స్‌–సన్‌షైన్‌ హాస్పిటల్‌ చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ సుధాకర్‌జాదవ్‌, హాస్పిటల్‌ నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ షైనీ చేరియన్‌తో కలిసి చర్చించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందజేస్తున్న కిమ్స్‌ సన్‌షైన్‌ హాస్పిటల్‌ను సందర్శించి ఆధునిక వైద్య సేవల చికిత్స విధానాలను తెలుసుకోవడం తమకెంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతినిధుల బృందాన్ని కిమ్స్‌ సైన్‌షైన్‌ హాస్పిటల్‌ ఇంటర్నేషనల్‌ బిజినెస్‌ రిలేషన్స్‌ హెడ్‌ గోకుల్‌ ప్రేమ్‌కుమార్‌ నేతృత్వంలో ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు.

అల్పాహారం వితరణ

సనత్‌నగర్‌: ఇంటర్నేషనల్‌ వైశ్య ఫెడరేషన్‌ హైదరాబాద్‌ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు వాడకట్టు శ్రీకాంత్‌ గుప్తా ఆధ్వర్యంలో ఈఎస్‌ఐ హాస్పిటల్‌ వద్ద అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు, సహాయకులతో పాటు బాటసారులు దాదాపు 500 మందికి అల్పాహారం అందజేసి ఆకలిని తీర్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్‌ వైశ్య ఫెడరేషన్‌ తెలంగాణ రాష్ట్ర అడిషనల్‌ జనరల్‌ సెక్రటరీ కటకం శ్రీనివాస్‌ గుప్తా హాజరై మాట్లాడుతూ నిరుపేదల ఆకలిని తీర్చేందుకు శ్రీకాంత్‌ చేస్తున్న



అల్పాహారం అందజేస్తున్న శ్రీకాంత్‌గుప్తా తదితరులు

కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్‌ నియోజకవర్గ అధ్యక్షుడు కల్వ వీరేందర్‌ గుప్తా, హైదరాబాద్‌ జిల్లా అడ్వైజర్‌ నాగరాజు గుప్తా, అఖిల్‌ గుప్తా, బొట్టు రవి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

సనత్‌నగర్‌: కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా ఆదివారం సనత్‌నగర్‌ శ్రీహనుమాన్‌ దేవాలయం ప్రాంగణంలోని శివాలయంలో రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అర్చకులు రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ, సుదర్శనాచార్యులు తదితరులు చండీ హోమం జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులను కనువిందు చేశారు. చివరి రోజు ఓం నమఃశివాయ..హరహర మహాదేవ శంభోశంకర అంటూ ఆలయ ప్రాంగణం మార్మోగింది.



రుద్రహోమం కార్యక్రమంలో ఈఓ సత్యనారాయణ, అర్చకులు రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ, సుదర్శనాచార్యులు తదితరులు



ప్రత్యేక అలంకరణలో శివయ్య

ఓయూ ఇంజనీరింగ్‌ కాలేజీలో ఎన్‌బీఏ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఇంజనీరింగ్‌ కాలేజీలో నేషనల్‌ బోర్డాఫ్‌ అక్రిడేషన్‌ (ఎన్‌డీఏ) సభ్యులు బృందం పర్యటించారని ప్రిన్సిపల్‌ ప్రొ.చంద్రశేఖర్‌ ఆదివారం పేర్కొన్నారు. ఎన్‌బీఏ బృందం సభ్యులు గత నెల 29, 30 డిసెంబరు1 తేదీలలో పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం సెంటర్‌ ఫెసిలిటీస్‌ విభాగంలో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు, పూర్వవిద్యార్థులతో సమావేశమై వివిధ అంశాల పై చర్చించారు.

కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీల పాలనలో ఎటువంటి తేడాలేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్‌: ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం 66 మోసాలు చేసిందని బీజేపీ సికింద్రాబాద్‌ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌ సుందర్‌గౌడ్‌ ఆరోపించారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీలు, 66 మోసాలపై చార్జ్‌షీట్‌ పేరిట ఆదివారం బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌ సుందర్‌గౌడ్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీల పాలనలో తేడా ఏమీ లేదని విమర్శించారు. అవినీతి, అక్రమాలకు మారుపేరు కాంగ్రెస్‌ పార్టీ అని, కేంద్ర నాయకత్వానికి డబ్బు పంపించడానికే హైడ్రాను తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పార్లమెంట్‌ కన్వీనర్‌, పెద్ది రవీందర్‌ పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస పూజలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి, ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌లోని ఆలయాల్లో నెలరోజులుగా జరుగుతున్న కార్తీక మాస పూజలు ఆదివారం ముగిశాయి. స్వామి వారికి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. ఓల్డ్‌ మల్కాజిగిరిలోని అంజనేయస్వామి ఆలయంలో మన్యుసూక్త హోమం, దేవాలయం పునఃనిర్మాణ దాతలు చింతల మల్లేశ్‌గౌడ్‌, మండల రాధాకృష్ణయాదవ్‌ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో నాగరాజు, శోభన్‌బాబు, స్థపతి జైరామ్‌, అరుణ్‌తేజ్‌గౌడ్‌, విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసుల దాడి

లాలాపేట: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ వ్యభిచార గృహంపై నార్త్‌ జోన్‌ టాస్క్‌ఫోర్స్‌, ఓయూ పోలీసులు దాడి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు తెలిపిన మేరకు.. ఉగాండా దేశానికి చెందిన నైబరే డోరీన్‌(42), కోముహంగి రీటా(22)అనే ఇద్దరు మహిళలు తార్నాక నాగార్జున నగర్‌ కాలనీలో నాలుగు నెలల క్రితం ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌పోర్సు పోలీసులు దాడి చేయగా విటుడు ఉప్పల్‌కు చెందిన పోట్టూరి అంజన్‌కుమార్‌ పట్టుబడ్డారు. ఇద్దరు మహిళలతో పాటు అతనిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కండోమ్‌ ప్యాకెట్లు, రూ 12,190 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మహిళా వర్సిటీని యూజీసీ గుర్తించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వీరనారి చాకలి ఐలమ్మ ప్రభుత్వ మహిళ విశ్వవిద్యాలయానికి యూజీసి గుర్తించేలా సీఎం రేవంత్‌ రెడ్డి కృషి చేయాలని తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం (టీఎంవీఎఫ్‌) రాష్ట్ర అధ్యక్షత కార్యదర్శులు స్వర్ణలత, తల్లమల్ల శ్వేత హసేన్‌ ఆదివారం డిమాండ్‌ చేశారు. యూనివర్సిటీని స్థాపించి మూడు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు యూజీసి గుర్తింపు లేకపోవడం దారుణమన్నారు. యూజీసీ గుర్తింపు లేనందున మహిళా వర్సిటీ డిగ్రీ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావని పేర్కొన్నారు.

అన్నదానం



బౌద్ధనగర్‌: కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్‌ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బౌద్ధనగర్‌ గాంధీ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన లష్కర్‌ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌ గౌడ్‌ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం నాయకులు బేలిదే రవికుమార్‌, పబ్బ చంద్రశేఖర్‌, ప్రభాకర్‌, వెంకటేశ్వర్‌రావు, మిట్టపల్లి బాబు రావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌ జర్నలిస్టులకు హెల్త్‌ కార్డులు



సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టులకు హైద్రాబాద్‌ యూనియన్‌ ఆఫ్‌ జర్నలిస్ట్స్‌ (హెచ్‌యూజే–టీడబ్ల్యూజేఎఫ్‌) ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు యూనియన్‌ నాయకులు ప్రకటించారు. సీతాఫల్‌మండి నామాల గుండులోని బీఎస్‌ఆర్‌ గార్డెన్స్‌లో ఆదివారం జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన యూనియన్‌ నాయకులు మాట్లాడుతూ..జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్‌ కార్డులను ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య, చంద్రశేఖర్‌, హెచ్‌యూజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్‌, జగదీశ్వర్‌, పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ కిష్టయ్యకు నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ కోసం బలిదానం చేసుకున్న కానిస్టేబుల్‌ కిష్టయ్యకు విద్యార్థులు నివాళులర్పించారు. ఆదివారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమ నేత నిజ్జన రమేష్‌ ముదిరాజ్‌, ముదిరాజ్‌ విద్యార్థి సంఘం నేతలు రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

రిజర్వేషన్లను మార్చే శక్తి ఎవరికీ లేదు



మాలల సింహ గర్జన సభకు తార్నాక నుంచి తరలి వెళుతున్న దృశ్యం

లాలాపేట: మాలమహానాడు ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన బహిరంగ సభకు ఆదివారం తార్నాకలోని చింతల్‌ బస్తీ నుంచి అంబేద్కర్‌ అసోసియేషన్‌ నాయకులు తుంగ లక్ష్మణ్‌ ఆధ్వర్యంలో మాలలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ మూల సూత్రాలకు విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లను మార్చే శక్తి ఎవరికీ లేదన్నారు. దళితుల మధ్య చిచ్చుపెట్టిన శక్తులను అడ్డుకునేందుకు దళితులంతా సంఘటితం కావాలని లక్ష్మణ్‌ పిలుపునిచ్చారు. అసోసియేషన్‌ అధ్యక్షులు రాజయ్య, సుద్దాల సురేష్‌, నర్సింగరావు, మనోహర్‌, బాలు, తుంగ నర్సింగరావు, కాంతమ్మ, మౌనిక, మంజుల, కిష్టాబాయి, రాజు తదితరులున్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: ఎమ్మెల్యే శ్రీగణేష్‌



కీడాకారుల అభిప్రాయాలను తెలుసు కుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌

రసూల్‌పురా: కంటోన్మెంట్‌ నియోజకవర్గంలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు మడ్‌ఫోర్ట్‌ హాకీ మైదానంలో అత్యాధునిక స్పోర్ట్‌ కాంప్లెక్స్‌ నిర్మించ నున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ తెలిపారు. ఆదివారం మడ్‌ఫోర్ట్‌ హాకీ మైదానం సందర్శించి వివిధ క్రీడల క్రీడాకారులను కలసి వారితో చర్చించి క్రీడల, క్రీడాకారుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్‌, వాలీబాల్‌, ఫుట్‌బాల్‌, బ్యాడ్మింటన్‌, ఇండోర్‌ గేమ్స్‌తో పాటు వాకింగ్‌ ట్రాక్‌, ప్రేక్షకుల గ్యాలరీ, తాగునీటి వసతి, టాయిలెట్లు తదితర వసతులు కల్పిస్తూ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ క్రీడాకారులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

సికింద్రాబాద్‌: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్‌(డీబీఎఫ్‌) జాతీయ కార్యదర్శి పీ. శంకర్‌, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పనలు పేర్కొన్నారు. బీబీఎఫ్‌ ఆధ్వర్యంలో ఆదివారం సీతాఫల్‌మండిలోని అంబేద్కర్‌ విగ్రహానికి జ్ఞాన మాల వేశారు. ప్రతీ మనిషికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో పాటు అన్ని రంగాలలో సమన్యాయాన్ని సమానత్వాన్ని రాజ్యాంగం అందించిందన్నారు. ఇటువంటి రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా పోరాడి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. డివిఎఫ్‌ నాయకులు సుజాత, రమ్య, శశికళ, జ్యోతి, మల్లేష్‌ పాల్గొన్నారు.



అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీబీఎఫ్‌ నాయకులు

విద్యార్థులను అభినందించిన ఉన్నత విద్యామండలి వైస్‌ చైర్మన్‌

లాలాపేట: యూనివర్సల్‌ కాన్సెప్‌ ఆఫ్‌ మెంటల్‌ అర్థిమెటిక్‌ సిస్టం(యూసి మాస్‌) ద్వారా పిల్లల్లో మేథోశక్తిని పెపొందించడానికి దోహదపడుతుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్‌ చైర్మెన్‌ ప్రొ ఇటికాల పురుషోత్తం అన్నారు. తార్నాకలోని అబాకస్‌ సెంటర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవలే సికింద్రాబాద్‌లోని హర్యానా భవన్‌లో జరిగిన అబాకస్‌ రాష్ట్రస్థాయి అత్యుత్తమ ప్రతిభ కనభరచిన విద్యార్థులను ప్రొ పురుషోత్తం అభినందించారు. కార్యక్రమంలో తార్నాక సెంటర్‌ ఇంచార్జి శోభారాణి, టిజాక్‌ హైదరాబాద్‌ చైర్మెన్‌ శ్రీరామ్‌ శివకుమార్‌, సుభాష్‌ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రొ. ఇటికాల పురుషోత్తం

చర్చిల అభివృద్ధికి కృషి



రసూల్‌పురా: కంటోన్మెంట్‌ నియోజకవర్గంలో చర్చీల అభివృద్ధికి కృషి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ తెలిపారు. రసూల్‌పురాలోని న్యూ లైఫ్‌ ప్రేయర్‌ పవర్‌ చర్చ్‌లో ఆదివారం జరిగిన థ్యాంక్స్‌ గివింగ్‌ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం క్రిస్టియన్ల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో బిషప్‌ నేహమ్యా శ్రీనివాస్‌ రావు. యాదగిరి, సాంసన్‌ రాజు, నరేష్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్‌ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జూబ్లీహిల్స్‌ రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి, ఈఎన్‌టీ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పుష్పగిరి కంటి ఆస్పత్రి, మా ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్యులు సుమారు 350 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్‌ రోటరీ క్లబ్‌ ప్రెసిడెంట్‌ బాలకోటిరెడ్డి, ప్రాజెక్ట్‌ ఇంచార్జీ రాజాకృష్ణ, సభ్యుడు ఎస్‌వీఎస్‌ సాగర్‌, పుష్పగిరి, మా ఆస్పత్రుల ఇంచార్జీలు అరుణ్‌, మధుకర్‌, డాక్టర్‌ అక్షిత్‌, బస్తీ నాయకులు మల్లేష్‌ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ రఘుబాబు

లాలాపేట: అన్నిదానాల్లోకెల్లా అన్నదానం చాలా గొప్పదని లాలాగూడ ఇన్‌స్పెక్టర్‌ రఘుబాబు అన్నారు. ఆదివారం లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో లాలాపేట ఆర్యవైశ్య సంఘం శాశ్వత అధ్యక్షులు నేతి రాములు, అధ్యక్షులు మడిపడగ శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోశాధికారి ఎనిశెట్టి భాస్కర్‌ తదితరులున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్‌ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. బొల్లారం – అల్వాల్‌ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై సుమారు 50–55 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

అడ్డగుట్ట: షార్ట్‌ సర్క్యూట్‌ సంభవించి విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగిన ఘటన తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బుద్ధానగర్‌లో చోటుచేసుకుంది. తుకారాంగేట్‌ ఇందిరా గాంధీ విగ్రహం సమీపంలోని బుద్ధానగర్‌కు వెళ్లే ప్రాంతంలో ఆదివారం ఉదయం విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌ సర్క్యూట్‌ సంభవించింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఫైర్‌ ఇంజన్‌ సహాయంతో మంటలను అదుపు చేశారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్‌ సిబ్బంది